ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు
బుధవారం 24 జనవరి 2024

వంట కార్మికుల ఆకలి మంట

- అరకొర వేతనాలు.. తప్పని వెతలు
- సకాలంలో జారీ కాని బిల్లులు
- కిచెన్‌షెడ్లు లేక అవస్థలు
- మధ్యాహ్న భోజన పథకం అమల్లో నిర్లక్ష్యం

భూపాలపల్లి టౌన్, జనవరి 23: చాలీచాలని వేతనాలు.. అరకొర సౌకర్యాలు. గంటల తరబడి మంటల సెగల్లో కాలుతున్న దేహాలు.. అయినా దక్కని కష్టానికి తగ్గ ప్రతిఫలం. ఇదీ మధ్యాహ్న భోజన కార్మికుల వెతలు. బిల్లులు సకాలంలో చెల్లించకపోయినా బడి పిల్లలు పస్తులు ఉండొద్దనే ఉద్దేశంతో అప్పులు తెచ్చి వంటలు చేస్తున్నా వీరి ఇబ్బందులను పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అరకొర ఆకలిని తీర్చుకొని పిల్లలకు వండిపెడుతున్నా తమ వ్యథను ఆలకించే వారెవరూ లేని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువులకు ఆకలి అడ్డుకావద్దనే ఉద్దేశంతో 1995లో అప్పటి కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం (మిడ్‌డే మీల్స్) పథకాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని అన్ని రాష్ట్రాల్లోనూ అమల్లోకి తెచ్చింది. పేదరికం కారణంలో బాలబాలికలు బడి మానేయకుండా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. వంట కార్మికుల ద్వారా బడి పిల్లలకు క్రమం తప్పకుండా రోజూ పౌష్టికాహారం వడ్డించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. తద్వారా పిల్లల్లో పఠనాసక్తి పెరిగి పాఠశాలకు హాజరవుతారని కేంద్ర ప్రభుత్వం భావించింది. అంతేకాదు.. ఈ పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక సద్భావన పెరుగుతుందని అంటోంది. అయితే... అప్పుడున్న స్ఫూర్తి ఇప్పుడు కానరావడం లేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.


కాటారం జడ్పీహెచ్ఎస్‌లో శిథిలావస్థలో ఉండి తెరుచుకోని వంట గది


మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో వంట గది లేక ఆరుబయటే మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు



వంట గదులు లేక..

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్లక్ష్యానికి గురైందని తెలుస్తోంది. కార్మికులకు చాలీచాలని గౌరవ వేతనాలు చెల్లించడం, వారు పెట్టుబడి పెట్టి వంటలు చేసినా బిల్లులను సకాలంలో జారీ చేయకపోవడం లాంటి పరిణామాలు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. పలు పాఠశాలల్లో వంట గదులు నిర్మించకపోవడం, మరికొన్నింట్లో అవి ఉండి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోకపోవడం వంట కార్మికుల ఆందోళనకు కారణమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలో 437 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 68 పాఠశాలల్లో వంట గదులు లేవు. మిగతా 369లో 84 వంట గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉన్న వాటిని సైతం మధ్యాహ్న భోజన కార్మికులు వాడుతున్నారా..? అంటే అదీ లేదు. ఆ గదులు ఏ మాత్రం అనువుగా లేకపోవడంతో ఆరుబయటే వంట చేస్తున్నారు. దీంతో వర్షాకాలం వీరికి నరకయాతన తప్పడం లేదు.

సరిగా దక్కని 'గౌరవం'

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం రూ. వెయ్యి మాత్రమే గౌరవ వేతనంగా చెల్లిస్తోంది. 28 ఏళ్లుగా పని చేస్తున్నా తమకు వేతనాలను నామమాత్రంగానే ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వేతనాలు పెంచనున్నట్టు గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అంటున్నారు. అసెంబ్లీ చివరి సమావేశాల్లో అప్పటి విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనంగా రూ.3 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. అది అమలుకు నోచుకోలేకపోయిందని, పైగా తమకు బిల్లులు కూడా మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు రావడం లేదని చెబుతున్నారు. దీంతో తాము అప్పుల పాలు అవుతున్నామని అంటున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.5, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8 చొప్పున మాత్రమే బిల్లులు నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుత ధరలతో పోల్చుకుంటే అవి సరిపోవడం లేదంటున్నారు.

పిల్లలకు అందని పౌష్టికాహారం

బడి పిల్లలకు పౌష్టికాహారంగా కోడిగుడ్లు ఇవ్వాలని ఆదేశాలున్నాయి. ఈ క్రమంలో వారంలో మూడుసార్లు గుడ్లు పెట్టాల్సి ఉంది. కానీ కొంతకాలంగా చాలా చోట్లా పాఠశాలల్లో గుడ్లు వడ్డించడం లేదు. మరికొన్ని చోట్లా వంట కార్మికులే అప్పుచేసి పెడుతున్నారు. ప్రస్తుత కోడిగుడ్డు ధర రూ.6.30 నుంచి రూ.7 ఉంది. ప్రభుత్వం చెల్లించేది రూ.5 మాత్రమే. దీంతో తాము పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఆర్థికంగా కుంగిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచి ఇవ్వాలని కోరుతున్నారు.

అవినీతి రహితంగా కాంగ్రెస్ పాలన

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


చిట్యాలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, జనవరి 23: అవినీతి రహితంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా పరిపాలించడమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయమని అన్నారు. అదే స్ఫూర్తితో నియోజకవర్గంలో పాలనను కొనసాగిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సహాయంతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తానన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలను మరచిపోనని అన్నారు. వారిని కంటికిరెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి మన్ననలు పొందే వారికే పదవులు వస్తాయన్నారు. గతంలో అధికార అహంతో కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వారికి గుణపాఠం చెబుతామన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను పేదలందికీ అందేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గం వ్యాప్తంగా త్వరలోనే కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, రాంనర్సింహారెడ్డి, అప్పం కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, మూల శంకర్, దబ్బెట రమేష్, మాజీ జడ్పీటీసీలు కాత్రేవుల సాయిలు, ఓరం సమ్మయ్య, దొడ్డి కిష్టయ్య, రాయకొమ్ము, కుమార్, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం ప్రారంభం

మండలంలోని కొత్తపేటలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. డీపీవో ఆశాలత, జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఆర్ ఈఈ దిలీప్, సర్పంచ్‌లు గజ్జి రవి, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 23: జిల్లాలోని పట్టభద్రులు ఫిబ్రవరి 6లోగా ఫారం -18 ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా జిల్లాలోని పట్టభద్రులు సీఈవోతెలంగాణ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2020 నవంబరు 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఇంతకు ముందు నమోదు చేసుకున్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిగ్రీ ఒరిజినల్ మెమోతోపాటు ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌ఫొటో, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

- భూపాలపల్లి కలెక్టరేట్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కును ఫిబ్రవరి 6లోగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6లోపు ఫారం -18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 14లోపు డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి మార్చి 29 వరకు పరిశీలిస్తామని వివరించారు. ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

గంజాయి రవాణాదారుడి రిమాండ్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 23: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భూపాలపల్లి ఎస్సై సంధ్యారాణి మంగళవారం వివరాలను వెల్లడించారు. భూపాలపల్లిలోని కృష్ణకాలనీకి చెందిన ఓ యువకుడు హైదరాబాద్ నుంచి గంజాయిని తీసుకొని తాను సేవించడముతో పాటు తెలిసిన వారికి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో రెండు రోజుల క్రితం అతడిని అదుపులోకి తీసుకోగా 150 గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. నిందితుడి పేరును పోలీసులు వెల్లడించలేదు.

పోలీసుల అదుపుల్లో ముగ్గురు స్మగ్లర్లు?

రేగొండ, జనవరి 23: మండల సమీపంలోని తిరుమలగిరి ఆర్చ్ వద్ద ముగ్గురు గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. భద్రాచలానికి చెందిన వీరు నాలుగు కిలోల ఎండు గంజాయిని కారులో భూపాలపల్లి వైపు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ఈ స్మగ్లింగ్ వ్యవహారంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి సూత్రధారి అని సమాచారం. ముగ్గురిని రేగొండలో, కానిస్టేబుల్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఈ విషయమై రేగొండ పోలీసులు వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు.

మహాజాతర పనుల్లో అలసత్వం వద్దు

- జాప్యం చేస్తే చర్యలు తప్పవు
- అధికారులపై గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ఫైర్
- మేడారంలో పలు శాఖల పనితీరుపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

మేడారం, జనవరి 23 : మహాజాతర పనుల్లో అధికారులు అలసత్యం వహిస్తే సహించేది లేదని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్ అన్నారు. ఆయా పనుల్లో జాప్యమవుతోందని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారంలో ఆయన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇ.వెంకటనర్సింహారెడ్డి, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం పర్యటించారు. వనదేవతల మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.

మేడారంలోని సమ్మక్క భవనంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జాతర శాశ్వత, తాత్కాలిక పనుల పురోగతిపై సమీక్షించారు. పనుల్లో జాప్యం జరుగుతోందని, వేగవంతం చేసి ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతరకు ముందస్తుగా మేడారానికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ స్థలంలో ఎన్ని వాహనాలను పార్కింగ్ చేయొచ్చో తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మేడారం దుకాణాలు, స్టాల్స్ వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. ముందస్తుగా వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగులో లోతట్టు ప్రాతాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ఇసుక లెవలింగ్ పనులను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. జాతర పరిసరాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. గత జాతరల్లో చోటుచేసుకున్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసర వైద్యం కోసం వీలైనంత ఎక్కువ సంఖ్యలో మినీ అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. భక్తుల సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దని, అన్ని పనులూ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పేలా మేడారం మహాజాతరను ఘనంగా నిర్వహించాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మధుర జ్ఞాపకాలు గుర్తుండిపోయేలా పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలన్నారు.


జంపన్నవాగు వద్ద పనులను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ మహాజాతరను విజయవంతం చేయడానికి ఎవరికి కేటాయించిన పనులను వారు సమర్థంగా చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయంగా బందోబస్తు వ్యవస్థను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఆయా శాఖల అధికారులు టీమ్‌వర్క్ చేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ములుగు ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ అశోక్‌కుమార్, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై హత్యాయత్నం

- గొడ్డలితో దాడిచేసిన అన్న
- ఆస్తి తగాదాలే కారణం

వెంకటాపూర్(రామప్ప), జనవరి 23: ఓ దివ్యాంగురాలిపై ఆమె సోదరుడు హత్యాయత్నం చేశాడు. గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఆస్తి తగాదాల నేపథ్యంలో తన భార్యతో కలిసి చెల్లిలిపై ఈ దారుణానికి ఒడిగట్టాడు. ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలో ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం...

వెంకటాపూర్(రామప్ప) మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన పొన్నం శ్రీశైలం-రాధమ్మ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు సమ్మయ్యకు, కుమార్తె లక్ష్మికి వివాహాలు జరిగాయి. మరో ఇద్దరు కుమార్తెలు పొన్నం రమణ, సారక్క దివ్యాంగులు కావడంతో వివాహాలు జరగలేదు. పొన్నం శ్రీశైలం చనిపోయే ముందు తనకు ఉన్న ఎనిమిదెకరాల భూమిలో ఐదెకరాలు కుమారుడు సమ్మయ్యకు, మిగిలిన మూడెకరాలు దివ్యాంగులైన ఇద్దరు కుమార్తెలు, భార్య రాధమ్మకు రాసి ఇచ్చాడు. ఈ క్రమంలో కొన్నేళ్లక్రితం తన వాటాలో వచ్చిన ఐదెకరాల భూమిని సమ్మయ్య విక్రయించి కుటుంబం సహా హైదరాబాద్‌కు మకాం మార్చాడు. అప్పటి నుంచి లక్ష్మీదేవిపేటలో తల్లి రాధమ్మ సంరక్షణలో దివ్యాంగులైన ఇద్దరు కుమార్తెలు తలదాచుకుంటున్నారు. రాధమ్మ కూలి నాలి చేసుకుంటూ కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్న ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో వీరికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో తమ వాటాలోని మూడెకరాల్లో ఎకరం భూమిని విక్రయించేందుకు నిర్ణయించి బయాన తీసుకున్నారు.

విషయం తెలుసుకున్న సమ్మయ్య హైదరాబాద్ నుంచి గ్రామానికి చేరుకుని తల్లి, ఇద్దరు చెల్లెళ్లను నిలదీశాడు. భూమిని అమ్ముకునే హక్కు లేదని హెచ్చరించి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. అయినా తమ వాటాను తాము అమ్ముకుంటామంటూ తల్లి, ఇద్దరు చెల్లెళ్లు ప్రయత్నించారు. ఇది తెలిసి నెలరోజుల క్రితం సమ్మయ్య తన భార్య ఇందిరతో కలిసి గ్రామానికి చేరుకొని ఇక్కడే ఉంటు న్నాడు. ఈ క్రమంలో తల్లి, చెల్లెళ్లతో సమ్మయ్యకు పలుమార్లు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం తల్లి రాధమ్మ కూలి పనులకు బయటకు వెళ్లగా సమ్మయ్యకు, చిన్న సోదరి సారక్క మధ్య మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సమ్మయ్య కోపోద్రిక్తుడయ్యాడు. సారక్కను ఇందిర గట్టిగా పట్టుకోగా అక్కడే ఉన్న గొడ్డలితో దాడి చేశాడు. దీంతో సారక్క తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. సారక్క కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా రక్తపు మడుగులో ఆమె పడి ఉంది. సమ్మయ్య, అతడి భార్య ఇందిర పారిపోయేందుకు యత్నించగా స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘన స్థలానికి చేరుకున్న ఎస్సై రాజు వెంటనే సారక్కను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లి రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమ్మయ్య, ఇందిరపై కేసు నమోదు చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సారక్క పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు.


సారక్క (ఫైల్)


నిందితుడు సమ్మయ్య

బహుజన రాజ్యస్థాపనే లక్ష్యం

ఆర్‌పీఐ రాష్ట్ర సమన్వయ కర్త జన్ను సాంబయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌పీఐ నేతలు

వడ్డెపల్లి, జనవరి 23: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను సంఘటిత పరిచి బహుజన రాజ్యాన్ని స్థాపించడమే పార్టీ లక్ష్యమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర సమన్వయ కర్త జన్ను సాంబయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పేదలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత ఇల్లు, స్థలం లేని ప్రతీ కుటుంబానికి మూడు గుంటల స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఆర్‌పీఐ నేత బొజ్జాతారకం సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 28న హనుమకొండలో నిర్వహించే ఆర్‌పీఐ రాష్ట్ర సదస్సులో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో సామాజిక, రాజకీయ విశ్లేషకుడు సాయిని నరేందర్, ఆర్‌పీఐ నేతలు సింగారపు అరుణ, మైదం జైపాల్, రాచకొండ ప్రవీణ్‌కుమార్, భవాని ప్రసాద్, కూనూరు రంజిత్‌గౌడ్, అన్వేష్, సాంబశివరాజు, సాగర్, రాజు, గణేష్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, జనవరి 23: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురువారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.


వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

ఆలయ నిర్మాణంపై రాజకీయమా..?!

మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సెగ్గం వెంకటరాణి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 23: భూపాలపల్లి మంజూర్‌నగర్‌లో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంపై రాజకీయ చేయడం సరికాదని మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి విమర్శించారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాల యంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయ నిర్మాణాన్ని రూ.14 కోట్ల నిధుల అంచనాతో ప్రారంభించారని తెలిపారు. ఇప్పటి వరకు ఆలయానికి రూ. 7.80 కోట్లు ఖర్చయ్యాయని వివరించారు. చందాల రూపంలో రూ.97 లక్షలు వచ్చాయని పేర్కొన్నారు. డీఎంఎఫ్‌టీ నుంచి రూ. 1.50 కోట్లు వెచ్చించినట్టు స్పష్టం చేశారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం ట్రస్టు పేరు మీదనే రిజిస్ట్రేషన్ అయిందన్నారు. జీఎంఆర్ఎం ట్రస్టు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని స్థానిక ఎమ్మెల్యే ఆరోపించడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై చేస్తున్న నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ఓ వ్యక్తి విలువైన భూమిని కబ్జా చేశాడని, అతడిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అండలేనిదే అతడు ఆ భూమిని ఆక్రమించుకున్నాడా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎంపీపీ మందల లావణ్య, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్లు బద్ది సమ్మయ్య, ఎడ్ల మౌనిక, మంగళంపల్లి తిరుపతి, ఆకుదారి మమత, నాయకులు సెగ్గం సిద్ధు, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

జంపన్నవాగులో అడ్డుకట్టల ఏర్పాటు

మేడారం, జనవరి 23 : మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు తరలి వచ్చే భక్తులు జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించేందుకు అడ్డకట్టలను నిర్మిస్తున్నారు. నాలుగు అడుగుల ఎత్తుతో జంపన్నవాగు ప్రవహించేలా ఈ చర్యలు చేపడుతున్నారు. బస్తాల్లో ఇసుక నింపి వాగుకు అడ్డుగా ఎనిమిది ప్రాంతాల్లో ఈ కట్టలను నిర్మిస్తున్నారు. పనులు పూర్తయినా తర్వాత ఫిబ్రవరి 21 నాటికి జంపన్నవాగు నిండా నీరు చేరేలా లక్నవరం సరస్సు నుంచి నీటిని విడుదల చేస్తారు. భక్తులు నిండుగా ప్రవహించే జంపన్నవాగులో పుణ్య స్నానాలు చేసి తరలిస్తారు.

హుండీల మరమ్మతులు

వనదేవతలు సమ్మక్క, సారలమ్మల మహాజాతరలో భక్తులు కానుకలు సమర్పించుకునేందుకు దేవాదాయ శాఖ అధికారులు హుండీల మరమ్మతుల పనులను కొనసాగిస్తున్నారు. మహాజాతరలో 550 హుండీలను ఏర్పాటు చేయనున్నామని ఈవో రాజేంద్రం తెలిపారు. వివిధ దేవాలయల నుంచి కూడా హుండీలను రప్పించామని అన్నారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరావు, పగిడిద్దరాజు హుండీలను మరమ్మతులు కూడా చేపట్టినట్టు తెలిపారు.



జంపన్నవాగు వద్ద అడ్డుకట్టల కోసం బస్తాలు వేస్తున్న కూలీలు

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, జనవరి 23: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని అమ్మ గార్డెన్‌లో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలన గడగడపకూ తీసుకెళ్లాల న్నారు. పార్టీ బలోపేతం కోసం పాటుపడాలని, కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, కంటుగూరి రాంనర్సింహరెడ్డి, అప్పం కిషన్, మాజీ జడ్పీటీసీ ఓరం సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, వైనాల రవీందర్, మండల అధ్యక్షుడు సతీష్, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఆకుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్య సత్యనారాయణరావు

పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా భుజంగరావు



తాడ్వాయి, జనవరి 23: పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా మేడారం ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పడిగ భుజంగరావు ఎన్నికయ్యారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మండల అధ్యక్షుడు కొర్నిబెల్లి నారాయణరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, యాకూబ్‌రెడ్డి, బాబూరావు, మల్లయ్య, పాయం మానేశ్వర్‌రావు, చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

వెంకటాపురం(నూగూరు), జనవరి 23: మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 86 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా 27మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఎస్సీమద్రిగూడెం గ్రామంలో బాల ఆదాలత్‌లో భాగంగా 15మంది చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చిన్నారుల తల్లిదండ్రులకు మెడికల్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, జనవరి 23: అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీని స్థానిక అంబేద్కర్ భవనంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పుల్లా ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా సరిగొమ్ముల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా మ్యాదరి సునీల్, ఉపాధ్యక్షుడిగా కట్కూరి శ్రీనివాస్, కోశాధికారిగా గుర్రపు రాజమొగిళి, కార్యదర్శులుగా దాసారపు నరేష్, గురుకుంట్ల కొరణ్, సభ్యులుగా బానోత్ రాజునాయక్, గుర్రం తిరుపతి, పాముకుంట్ల చందర్, కట్కూరి రాజేందర్, ముత్యాల మొగిలి, కుమ్మరి నరేష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య, జన్నె యుగేందర్, గుర్రపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల : అంబేద్కర్ యుజన సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్ల ప్రేమ్ సాగర్ ఈ మేరకు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా అరకొండ రాజయ్య, ఉపాధ్యాక్షులుగా పారనంది రాములు, మాడుగుల వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా గాదం దామోదర్, సహాయ కార్యదర్శిగా కోండ్ర సారయ్య, కార్యదర్శులుగా కనుమరుగుల కొమరయ్య, పర్లపల్లి రాజేందర్, ముఖ్య సలహాదారులుగా మచ్చ పోషయ్య, గౌరవ అధ్యక్షుడిగా నేరేళ్ల రామకృష్ణను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

వెంకటాపురం(నూగూరు), జనవరి 23: మండలంలోని మహితాపురం, మహితాపురం కాలనీలో మంగళవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 50 నిరుపేద కుటుంబాలకు సంస్థ డైరెక్టర్ లూర్ధురాజు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా ఏజెన్సీ గ్రామాల్లోని నిరుపేదలకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని, అందులో భాగంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, వాజేడు మండల కోఆర్డినేటర్ కామేష్, యానిమేటర్లు ప్రశాంత్, నరేష్, భాస్కర్, ప్రసాద్, ఇందిర, పద్మ, రమాదేవి, ఉష, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై బాలికలకు అవగాహన

టేకుమట్ల, జనవరి 23: మండల పరిధి అంకుషాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. మిషన్ శక్తి ఇన్‌చార్జి కోఆర్డినేటర్ అనూష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలకు చట్టపరమైన హక్కులు, నాణ్యమైన విద్య, వైద్యం, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో స్వప్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి : డీఎస్పీ



అవగాహన ర్యాలీలో డీఎస్పీ, ఎస్సై, ఆటో డ్రైవర్లు

కాటారం, జనవరి 23: రహదారి భద్రతపై వాహనాల డ్రైవర్లు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. కాటారం పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రహదారి భద్రతపై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఆటోలతో ప్రదర్శన నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందన్నారు. విలువైన ప్రాణాలు, భవిష్యత్‌ను పణంగా పెట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మ్యాక అభినవ్, పలు పార్టీల నాయకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఫిట్ సెక్రటరీ మృతి



కార్తీక్ (ఫైల్)

కాకతీయఖని, జనవరి 23: బీఎంఎస్ ఆరో గని ఫిట్ సెక్రటరీ కెక్కర్ల కార్తీక్ (32) అనారోగ్యంతో మృతి చెందారు. ఏరియాలోని కేటీకే ఆరో గనిలో ట్రామర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కార్తీక్ 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కార్తీక్ మృతదేహాన్ని వివిధ రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల నేతలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఎంఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య, ఏఐటీయూసీ ఆరో గని సెక్రటరీ శ్రీనివాస్, బీజేపీ నాయకుడు ఎరుకల గణపతి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మొగుళ్లపల్లి, జనవరి 23: మండలంలోని ఇస్సిపేట గ్రామ శివారు వాగులో నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపారు. వాగొడ్డుపల్లి గ్రామంలోని దివిటీల మహేష్‌కు చెందిన ట్రాక్టర్ ద్వారా ఇతర గ్రామాలకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా టేకుమట్ల మండలం సోమనపల్లికి చెందిన రెండు ట్రాక్టర్లు రాఘవరెడ్డిపేట వాగు నుంచి మండలంలోని ఇప్పలపల్లికి ఇసుకను తరలిస్తుండగా వాటిని పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది.

ఘనంగా బాలికా దినోత్సవం

మేడారం, జనవరి 23 : తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క (ఆదివాసీ) భవనంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్ హాజరయ్యారు. డైరెక్టర్ ఇ.వి.నర్సింహరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలిక సంరక్షణపై అవగాహన కల్పిస్తూ 'బేటీ బచావో... బేటీ పఢావో' నినాదంతో రూపొందించిన పోస్టర్, స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. బాలికల సంరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ మాట్లాడుతూ బాలికలను సంరక్షించడం మన ప్రాథమిక బాధ్యత అన్నారు. అధికారులు, పౌరులు ఇందుకు కృషి చేయాలన్నారు. ఆడపిల్లల్ని రక్షిస్తే అమ్మను గౌరవించినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ జిల్లా అధికారి ఓంకార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

● వెంకటాపురం(నూగూరు): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బాలల హక్కులు, పరిరక్షణ చట్టాలపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో శిరీష గ్రామస్థాయిలో బాలల హక్కులు, పరిరక్షణలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరికృష్ణ బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిషేధం, బాలలపై లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు జాతీయ బాలికా దినోత్సవాన్ని పుర స్కరించుకుని బాలికల వ్యక్తి గత పరిశుభ్రతపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి కౌన్సిలర్ కల్పన, కమ్యూనిటీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● మంగపేట : జాతీయ బాలికా దినోత్స వాన్ని పురష్కరించుకొని మండ లంలోని కమలా పురంలో రోసా మిస్టికా స్కూల్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. డీసీపీయూ మండల ఇన్‌చార్జి భూక్య రాజు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) జిల్లా కమిటీ సభ్యురాలు ఆకుపెల్లి మధు హాజరయ్యారు. సీడబ్ల్యూసీ సభ్యురా లు షాహీన్, ఏటూరునాగారం ప్రాజెక్టు సీడీపీవో వి.హే మలత, చైల్డ్ హెల్ప్‌లైన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నరేష్, పాఠశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ ఫ్రాన్సీస్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ గీత పాల్గొన్నారు.



మేడారంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 23: భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై ధర్మపురి సర్కిల్‌కు వెళ్తున్న సీఐ రాంనర్సింహారెడ్డిని మంగళవారం స్టేషన్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాలువా, పూలమాలతో సత్కరించి ఇన్నాళ్లు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సంధ్యారాణి, ఏఎస్సై సాంబయ్య, హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తామర పురుగు నివారణ తప్పనిసరి

కాకతీయఖని, జనవరి 23: మిర్చి పంటలో తామర పురుగు ఉధృతి అధికంగా ఉందని, దాని నివారణ తప్పనిసరని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, వ్యవసాయ శాస్త్ర వేత్తలు దిలీప్‌కుమార్, విశ్వతేజ్ అన్నారు. భూపాలపల్లి మండలం వేశాలపల్లి, రేగొండ మండలం రంగయ్యపల్లిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 'గ్రీన్‌వుడ్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

మహదేవపూర్ రూరల్, జనవరి 23 : మండలంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.పూజిత, పి.స్నేహమాధూరి, జి.సిద్ధార్థ, జి.అశ్విత్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల కరెస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈమేరకు ఎంపికైనట్లు పేర్కొ న్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరక్టర్ రాజ్‌కుమార్ విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేసి అభినందించారు.

అడవులను అభివృద్ధి చేయాలి : డీఎఫ్‌వో

కాటారం, జనవరి 23: ప్లాంటేషన్లను పకడ్బందీగా చేపట్టి అడవులను అభివృద్ధి చేయాలని భూపాలపల్లి డీఎఫ్‌వో వసంత ఫారెస్టు అధికారులను ఆదేశించారు. మంగళవారం కాటారం రేంజ్ పరిధిలోని దామెరకుంట సెక్షన్ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ప్లాంటేషన్ వివరాలను సంబంధిత సెక్షన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలను పశువులు పాడుచేయకుండా, వేసవిలో ఎరగడి పడి నాశనం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వో ఆదేశించారు. ప్లాంటేషన్‌లో మొక్కలు బాగా ఎదుగుతున్నాయని ఇదే రీతిలో పెరిగేలా చూడాలన్నారు. రెండో ఏడాది మెయింటెనెన్స్ సక్రమంగా చేస్తే మొక్కలు బాగా ఎదుగుతాయన్నారు. డీఎఫ్‌వో వెంట కాటారం ఇంచార్జి రేంజర్ కిరణ్‌కుమార్, దామెరకుంట సెక్షన్ అధికారి పోడేటి చంద్రశేఖర్, ఎఫ్‌బీవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు అభివృద్ధికి కృషి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

వాజేడు, జనవరి 23: భద్రాచలం నియోజకవర్గంలోని వాజేడు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం తొలిసారిగా విచ్చేసిన ఆయనకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆరుగుంటపల్లి నుంచి మురుమూరు, ప్రగళ్లపల్లి, జగన్నాథపురం, దూలాపురం, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి, గొల్లగూడెం, చెరుకూరు, టేకులగుడెం, కృష్ణాపురం, చంద్రుపట్ల, పేరూరు, ధర్మవరం, చింతూరు మీదుగా వాజేడు వరకు ఆయన పర్యటన సాగింది. ధర్మవరంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తన విజయానికి తోడ్పడ్డ ప్రతి కార్యకరకూ, ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. వాజేడు మండలంలోని కృష్ణాపురంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మోడికుంట ప్రాజెక్టు నిర్మాణ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యే కృషి చేస్తానన్నారు. మండలంలోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా మంత్రుల ద్వారా కృషి చేస్తాన్నారు. ఆయన వెంట నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుచ్చయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పీఆర్‌కె రెడ్డి, కార్యదర్శి సోమిడి నరసింహరావు, ఎంపీపీ శారద, జడ్పీటీసీ పుష్పలత, మాజీఎంపీపీ స్వరూప, నాయకులు కల్యాణ్, దత్తుడు బాబు, సత్యనారయణ, సుగంధపు సాంబశివరావు, గార నాగార్జునరావు, వేణు, మోహన్‌రావు, ఎట్టి సంతోష్, సర్పంచ్‌లు కోరం సాంబయ్య, సరస్వతి, జయలక్ష్మి, తెల్లం బుల్లెశ్వరరావు, పూసం నరేష్‌కుమార్, బెనిని, తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఉరేసుకొని ఆత్మహత్య

ఏటూరునాగారం, జనవరి 23 : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏటూరునాగారంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ ప్రసాద్ కథనం మేరకు..ఏటూరునాగారంలోని ఆకులవారిఘణపురానికి చెందిన జగన్నాథం హరిబాబు(38) కొంత కాలంగా స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట చిన్న డబ్బా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అతడు మద్యానికి బానిసయ్యాడు. తరచుగా భార్యా పిల్లలతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం మద్యం తాగిన హరిబాబు రాత్రి 9 గంటల తర్వాత ఇంట్లో భార్యతో గొడవ పడి బయటికి వెళ్లాడు. తెల్లవారిన తర్వాత కొడుకు భువన కుమార్ తమ దుకాణం వెనకాల చూడగా హరిబాబు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ఏటూరునాగారం, జనవరి 23 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయ్ యాత్రను బీజేపీ నేతలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసనకు దిగారు. మంగళవారం బస్టాండ్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప దాడులు చేయడం సరికాదన్నారు. నియోజకవర్గ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, యూత్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, పీఎసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో మౌలిక సౌకర్యాలు

● అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు, జనవరి 23: జిల్లాలోని ఎనిమిది గ్రంథాలయాల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పన కోసం చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగులోని జిల్లా గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రంథాలయాలలో పాఠకులకోసం మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించడంతోపాటు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లా గ్రంథాలయం చుట్టూ ఇనుప కంచెను తక్షణమే ఏర్పాటు చేయాలని గ్రంథాలయ అధికారులను ఆదేశించారు. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.కోటి 9లక్షలను ప్రతిపాదించినట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి అలివేలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేట్ బద్దం సుదర్శన్‌రెడ్డి, లైబ్రేరియన్ సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

కాకతీయఖని, జనవరి 23: అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు, అంగవైకల్యం పొందిన కార్మికులకు కేంద్ర మంత్రిత్వ శాఖ ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు భూపాలపల్లి జిల్లా సహాయక కార్మిక శాఖ అధికారి వినోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా ద్వారా 2022 మార్చి 3లో ఈ-శ్రమ్ కార్డు నమోదు చేసుకుని మరణించిన వారి నామినీలకు రూ. 2లక్షలు, అంగవైకల్యం చెందిన కార్మికులకు రూ. లక్ష అందించనున్నట్లు పేర్కొన్నారు.

అర్హత ఉన్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 19 లోపు జిల్లా కార్మిక సహాయక కార్యాలయంలో తమ దరఖాస్తులను అందచేయాలని ఆయన కోరారు. దరఖాస్తులతోపాటు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఈ-శ్రమ్ కార్డు, ఎఫ్ఐఆర్, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టు, వైద్య ధ్రువీకరణ పత్రం, నామిని బ్యాంక్ అకౌంట్ ప్రతులు అందజేయాలని సూచించారు.